# రాణీ ఈగ

శ్రీవల్లి సోఫాలో కూర్చుని ఎదురుగా వున్న టీ.వి.లో కదిలే బొమ్మలవైపు చూస్తోంది. ఏదో కథ తెరమీద నడుస్తున్నా, ఆ కథ వింటూ ఆ బొమ్మల వెంట ఆమె మనసు నడవడం లేదు. వేరే ఏదైనా ఆలోచిస్తోందని చెప్పటమూ కష్టమే. ఆమె మనసులో స్థిమితం లేని అవస్థ ఏదో వుందనిపిస్తుంది. ఊరటగా టీవీ ముందు కూర్చునట్టుంది. అంత పెద్ద ఇంట్లో నిశ్శబ్దంగా వుండటం కష్టం –, ఏదో ధ్వనికోసం నడుస్తోంది టీ.వి.

టెలిఫోను మోగడంతో వులిక్కిపడింది శ్రీవల్లి. వెంటనే వెళ్ళి ఫోనందుకోవాలంటే ఏదో బెరుకుగా భయంగా అనిపించింది. ఎవరు ఫోను చేస్తున్నారో అనే సంశయం మొదలైంది. తీరా ఫోను తీస్తే ఏం మాట్లాడాలో, అసలు అవతలి వైపు వారి ఎవరో – నాలుగైదుసార్లు మోగాక విధిలేక వెళ్ళి రిసీవర్ తీసుకుంది. హల్లో అందామా వద్దా అని ఆలోచిస్తుండగా అవతలి వైపునుంచి తల్లి గొంతు వినిపించింది.

"అమ్మా" అంది సావిత్రి.

"అవునమ్మా నేనే" అంది శ్రీవల్లి.

"ఎప్పుడొచ్చావ్ –, ఫోన్ చేసావంటే కంగారుపడ్డాను. ఎలా వున్నావు – నేనో గంటలోపు వచ్చేస్తాను. అన్నం తిన్నావా" అంది సావిత్రి ఆఫీసు నుంచి–

శ్రీవల్లికి సమాధానం చెప్పాలని వుంది కానీ గొంతు పూడుకుపోతోంది. వెంటనే మాట్లాడకపోతే తల్లి గుండెలు బెంబేలు పడిపోతాయి. అందుకే ఎంతో నిగ్రహంగా "తిన్నాను. నువ్వు నెమ్మదిగా రా – ఫర్వాలేదు" అంది పంటి బిగువున.

సావిత్రి ఫోన్ పెట్టేసింది. శ్రీవల్లి నెమ్మదిగా కళ్ళు తుడుచుకుని మళ్ళీ సోఫావైపు వెళ్తుంటే కాలింగ్ బెల్ మోగింది.

వెళ్ళి తలుపు తీసింది. తలకి తువ్వాలు కట్టుకుని వాచ్‌మెన్ కనిపించాడు. "ఏమైందీ" అంది.

"ఏం లేదమ్మా! అమ్మగారొచ్చిరా" అన్నాడు.

"లేదు"–

"తేనెపట్టు తీసెయ్యాలమ్మా... అమ్మకి చెప్దామని...." తనలో అనుకున్నట్ల న్నాడు.

శ్రీవల్లి రెండడుగులు ముందుకే వేసి చూసింది. ఎదురు బ్లాకులో సన్‌షేడ్‌కి అంటిపెట్టుకుని తేనెపట్టు. దాని చుట్టూ తిరుగుతున్న ఒక తేనెటీగ–.

"మొన్ననేగా తీసేశారు" అంది ఆశ్చర్యంగా.

"మూడు నెలలు దాటి పోయిందమ్మా!" అన్నాడు. ఆమెకి గుర్తొచ్చింది. తనిక్కడికి వచ్చినప్పుడే ఆ తేనెపట్టును కూలగొట్టారని –

"మూడొందలారు బెడ్‌రూం తలుపు తీసేందుకు లేదంటమ్మ".

అతను వెళ్ళిపోయాడు. ఈ అపార్టుమెంటులో మూడో అంతస్థులో ఎప్పుడూ ఈ తేనెపట్టు పడుతూనే వుంటుంది అనుకుంది శ్రీవల్లి–.

నీరసంగా వెళ్ళి దీవాన్ మీద తలగడ సర్దుకుని పడుకుంది. టీవీలో చాలా సేపట్నించి ఒక ఆడపాత్ర ఏడుస్తూ వుంది. శ్రీవల్లి కళ్ళు మూసుకుంది. ఒక్కక్షణం ఎలాగో అయిపోయింది. ఆమె మనసు, తనకా ఏడుపు ఫ్లే బ్యాక్‌లా అనిపించింది.

❖ ❖ ❖

పెళ్ళి జరిగే కళ్యాణ మండపం సందడిగా వుంది. రాత్రి పన్నెండు గంటలు మూడు నిమిషాలకి సుముహూర్తం. ఉదయమే ఆడ పెళ్ళి వారుగా సావిత్రీ, కృష్ణారావు బంధుజనంతో వచ్చి వాళ్ళ గదుల్లో సర్దుకుని హడావిడి పడటం మొదలుపెట్టారు. రెండు గంటల ప్రాంతంలో మగపెళ్ళివారు వచ్చి తమకిచ్చిన గదుల్లో సామాను పరుచుకుని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఏం కావలసినా ఆడపెళ్ళి వార్ని గదమాయించవచ్చు ననే ధీమా వారి ప్రతీ కదలికలోనూ స్పష్టమౌతోంది.

కృష్ణారావు కూతురి పెళ్ళి గురించి హడావిడి పడిపోతూ అటు ఇటూ పరుగులు పెడుతున్నాడు.

సావిత్రి కావలసినవన్నీ మరొక్కసారి సరిచూసుకుని రానివి వాళ్ళకీ వీళ్ళకి పురమాయిస్తోంది. పూలదండలు రావాలి - పెళ్ళివారు తలలో పెట్టుకునేందుకు పూలు కావాలి-

కూతురి పెళ్ళి తాలూకు ఆనందం, ఆందోళన, బెంగ, భయం అన్నీ కలిసి సావిత్రి ముఖం జేవురించింది.

మగపెళ్ళివారికి కాఫీలు, టీలూ, టిఫెన్లు, డ్రింకులూ ఎప్పటికప్పుడు అందుతున్నట్లు సమాచారం అందుతూనే వుంది.

బ్యూటీపార్లర్ నుంచి వచ్చిన నాజూకు అమ్మాయి శ్రీవల్లికి మేకప్ చేసేందుకు అన్నీ సర్దుకుంటోంది. తలంటు పోసుకుని జుత్తు ఆరబెట్టుకుంటూ అక్కడే కూర్చుంది శ్రీవల్లి.

నిజానికి శ్రీవల్లి అందగత్తె కాదు. చామనచాయ, చిన్నకళ్ళు, బండ పెదాలు-, బుగ్గలపైన ఎముకలు కాస్త పైకి పొడుచుకొచ్చి కళ్ళు మరీ గుంటల్లా వుంటాయి.

బ్యూటీషియన్ నెమ్మదిగా శ్రీవల్లిని వీలయినంత అందంగా కనిపించేలా తయారు చేయటానికి సొగసులు దిద్దుతోంది. ఏది ఏమైనా పెళ్లి కూతురు కనుక ఆమెని అందంగా కనిపించేలా చెయ్యాలి, అందుకే వచ్చింది బ్యూటీషియన్.

"అమ్మా! రేఖా వచ్చిందా" అని అప్పటికి ఎన్నోసార్లు అడిగింది శ్రీవల్లి.

"రాలేదమ్మా! వస్తుందిలే" అంటూ సావిత్రి సమాధానం ఓర్పుగా చెప్పింది.

పిహెచ్‌డి చేసిన ముప్ఫై రెండేళ్ళ కూతురు సిగ్గు మొగ్గైపోతుంటే చూసుకుని మురిసిపోతోంది సావిత్రి.

అనుకున్న దానికంటే కాస్త ఆలస్యంగా రేఖ వచ్చింది. వస్తూనే "శ్రీ..." అంటూ వెనుకగా రెండు భుజాల మీదా చేతులు చేసింది స్నేహంగా.

"ఏమ్మా! నీకిప్పటికీ తీరిందా" అంది అలకనటిస్తూ శ్రీ.

"ఇంకా నయం ఇప్పటికైనా రాగలిగాను. సంతోషించు" అంది రేఖ దబాయింపుగా.

"ఏం?"

"ఏమయింది. ఈ వేళ సెలవుపెట్టేద్దామంటే కుదరలేదు. మధ్యాహ్నం ఎగ్గొట్టి రావాలని ప్లాన్. కానీ మా బాస్ దగ్గర ఒంటిగంట నుంచి మొదలుపెడితే ఇప్పటికైంది."

"అదేంటి?".

"అదంతే – మా బాస్ లేడీ కదా! ఒకపట్టాన వదిలిపెట్టలేదు".

"నువ్వు మరీ అన్యాయం".

"నిజం! ఇదే మా పాత బాస్ అయితే ఒక్కమాట చెప్పగానే ఓకే అనేవాడు" అంది రేఖ కాస్త డ్రమెటిక్‌గా.

"అదేంటీ?"

"మగాడు కదా"

"ఛీ! అలా మాట్లాడకు, బాగుండదు. సిగ్గుగా వుంటుంది" అంటూ తలొంచు కుంది శ్రీ. రేఖ ఆశ్చర్యంగా చూస్తూ –

"నువ్విలా మొద్దు రాచ్చిప్పలాగా వున్నావు సుమా! అది సరేగానీ పెళ్ళి కొడుకుతో మాట్లాడవా" అంది.

"ఛీ! పాడు పెళ్ళికాకుండా మాటలేమిటీ అసహ్యంగా" అంది.

రేఖ మరింత ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసి చూస్తుండిపోయింది.

ఒక్క క్షణం ఆగి "అది కాదు శ్రీ... ముందు కాస్త మాట్లాడితే మంచిది. ఇంత చదువుకుని... నువ్వు"

"ఎంత చదువుకున్నా మన సంప్రదాయాల్ని విడుచుకుంటాను?" అంది శ్రీ చాలా ముదురుగా.

రేఖ నిశితంగా చూస్తుండిపోయింది.

"అది కాదే శ్రీ... అసలు పెళ్ళి చూపులప్పుడే మాట్లాడాలి. అతని అభిప్రాయాలు, అభిరుచులు, అలవాట్లు కాస్త తెలుస్తాయి కదా" అంది.

"అవన్నీ అమ్మా, నాన్న చూశారు. నాకేం కావాలో వాళ్ళకి బాగా తెలుసు. వాళ్ళు నా మంచికోసం అన్నీ చేస్తారనే నమ్మకం నాకుంది" అంది సీరియస్‌గా.

రేఖ అవాక్కయిపోయింది. "నేను పెళ్ళికొడుకుని చూసివస్తా" అంటూ వెళ్ళిపోయింది రేఖ.

"దీనికంతా తొందర. పైగా మగాళ్ళంటే అస్సలు భయం లేదు, సిగ్గూ పడదు" అంటూ తేల్చింది శ్రీ.

"పెళ్ళికూతురివి నీకు సిగ్గుగానీ నీ స్నేహితురాలికెందుకూ సిగ్గూ..." అంటూ పక్కన కూర్చున్న పిన్ని దీర్ఘం తీసింది.

కార్యక్రమం వేగం పుంజుకుంది. శ్రీవల్లి మరీ ముడుచుకుని కొంచెం కూడా తలెత్తకుండా భూమిలోకి క్రుంగిపోవడం మొదలెట్టింది.

అంత చదువుకుని, యూనివర్శిటీలో మసిలిన శ్రీవల్లి అసలు మగపురుగుని చూడనట్లు, అప్పుడే చూస్తున్నట్లు వుండటం రేఖనే కాక కొందర్ని ఆశ్చర్యపరిచినా, పెళ్ళిలో ఆ విధంగా వుండటం మన సమాజంలో సహజమేనని సరిపెట్టుకుని, నవ్వుకుని వూరుకున్నారు.

పెళ్ళితంతులో అత్తగారు ధూముధాములు చేసింది. అది సహజమే అని సరిపెట్టుకుని అడుగులకు మడుగులొత్తారు.

ఆడపడుచు అలిగి అన్నానికి రాకపోతే అదే అసలు పెళ్ళికి అందం అని మురిసి, ఆమె గొంతెమ్మ కోరికలు తీర్చి భోజనాల పంక్తికి తీసుకొచ్చారు. అనుకున్నవీ, అనుకోనివీ అడుగుతూ వాళ్ళు బాగానే లాంఛనాలు లాగారు. కంగారు పెట్టారు. అవును మరి ఆడపిల్ల పెళ్ళంటే సామాన్యమా? అంటూ అయిన వాళ్ళంతా బుగ్గలు నొక్కుకున్నారు. ఎలాగోలాగ ఆ మూడుముళ్ళూ పడ్డాయని ఆనందించారు. పెళ్ళికొడుకు తల్లియందు ఎంతో విధేయుడుగా వుండటం అందరికీ ముచ్చటగా అనిపించింది. ప్రతీమారు తల్లినడిగి ఆమె అనుమతితో చెయ్యడం కొడుకంటే అలావుండాలి అంటూ కొందరు అతి గొప్పలు కూడా పోయారు.

శ్రీవల్లిని అత్తగారింటికి పంపి సావిత్రి మూడు రోజులు మంచం దిగలేదు. ఎన్నిచేసినా, ఎంత ఇచ్చినా వాళ్ళు అల్లరి చేస్తూనే వున్నారు. అవమానంగా మాట్లాడుతూనే వున్నారు. అదేమంటే ఆడపిల్లని కన్నందుకు ఆ మాత్రం ఓర్చుకోలేరా? అని ముఖం మీదే అడిగారు.

కూతురి పెళ్ళిచేసిన సంతోషం, తృప్తీ, శాంతీ సావిత్రికి అస్సలు మిగల్లేదు సరికదా సన్నటి బెంగ గుండెల్లో మంటలా రాజుకోవడం మొదలైంది.

మూడు నిద్రల కార్యక్రమంలోనే ముచ్చట్లన్నీ తీరిపోయాయి. కూడా వెళ్ళిన పిన్ని శ్రీవల్లిని నిలదీసింది.

'ఇంత అందమైన చీర పెట్టిందేమే మీ అత్తగారూ' అని.

శ్రీవల్లికి కోపం పిన్నిని మింగేద్దామన్నంతగా వచ్చింది.

"నేనో చీర కొనిచ్చేస్తానులే" అంది ఘరానాగా. 'నువ్వేం కొనివ్వక్కర్లేదు. పదుగంటి చీర బాగుండ లేదని, నానా అల్లరీ చేసి, చీర మార్పించిన మీ అత్తగారికి

వచ్చిన వాళ్ళకి మంచి చీర పెట్టాలని తెలీదా' అంటూ తేల్చింది పిన్ని. అప్పటికే సగం చచ్చిన సంతోషంతో శ్రీవల్లి ఏడుపు మొదలు పెట్టింది.

కొత్త పెళ్ళికూతుర్ని కళ్ళనీళ్ళు పెట్టిస్తావుటే అంటూ చెల్లెలి మీద తాడెత్తున లేచింది సావిత్రి.

ఆ వెళ్ళడం వెళ్ళడం శ్రీవల్లి ఊసు నెల్లాళ్ళ వరకు తెలీలేదు. ఇంకా ఎలాగైనా అది అక్కడే సర్దుకోవాల్సిందేకదా అని కృష్ణారావు, సావిత్రి గుండె దిటవు చేసుకున్నారు.

నెల్లాళ్ళయిపోయిందని చూసి వద్దామని వెళ్ళిన వాళ్ళిద్దరూ శ్రీవల్లిని చూసి అవాక్కయిపోయారు. సన్నగా, నీరసంగా తయారై కళ్లలో ప్రాణాలతో కూతురు కనిపించే సరికి వాళ్ళ గుండెలు జారిపోయాయి. ఏ మాటా మాట్లాడినా దులిపేస్తోంది అత్తగారు. శ్రీవల్లి మీదా, పనితనం మీదా, ఆమె చురుకుతనం మీదా దుమ్మెత్తి పోసింది. ఆమెగారికి సపోర్టుగా మామగారు మాట కలుపుతున్నాడు.

ఇంతా అతని ఎదురుగా జరుగుతున్నా గుడ్లు మిటకరిస్తూ వున్నాడే గానీ ఒక్కమాట మాట్లాడలేదు పతిదేవుడు. ఒకవేళ మాట్లాడినా అది వాళ్ళమ్మవైపే.

కనీసం అత్తమామల్ని గౌరవంగా ఆహ్వానించను కూడా లేదు. ఇద్దరూ ఏం మాట్లాడితే ఏం జరుగుతుందో అని నోరు మూసుకుని యింటికొచ్చి పడ్డారు. సావిత్రికి హైబిపీ వచ్చేసింది. కృష్ణారావు జ్వరపడిపోయాడు.

ఎక్కడే లోపం జరిగిందీ అని ఎంత తర్జనభర్జనలు చేసుకున్నా వారికి అంతుపట్టలేదు. పౌరుషంగా మాట్లాడి పిల్లని తీసుకొచ్చేదామంటే, ఆమె జీవితం పాడయిపోతుందని భయం.

జాతకాలు చూశారు. ఓహో! అద్భుతంగా కుదిరాయి. ఇంటి గురువుగారు గ్రీన్‌సిగ్నల్ యిచ్చి అంతటి ఉత్తమ పురుషుడు మరికలేడని సర్టిఫికేట్ యిచ్చారు. గీసి, గీసి కట్నాలు కానుకలు మాట్లాడుకున్నారు. మాట్లాడుకున్నవి కాక దొరికినంత దొరక పుచ్చుకున్నారు. పోనీ అంతా తీసుకుని హాయిగా వున్నా బాగుండేది. అబ్బే - అది లేదు-

అల్లుడు అత్తారివైపు, అంటే భార్య తల్లిదండ్రుల వైపుతిరిగిపోతాడని భయంట. కోడలు మాత్రం తల్లినీ, తండ్రినీ, ఆ వైపు బంధువుల్నీ కన్నెత్తి చూడకూడదు.

ఇంత జరిగినా పిల్లాడు మంచివాడే - అత్తగారే రాక్షసి, పిశాచి, గయ్యాళి అని తేల్చారు కృష్ణారావు సావిత్రి.

కాళ్ళకింద నిప్పులు పోసేస్తే శ్రీవల్లి మూడు నెలలు గడిచేసరికి కట్టుబట్టలతో పుట్టింటికొచ్చేసింది. అక్కడ్నించి మళ్ళీ అగచాట్లు మొదలయ్యాయి. పిల్లని సముదాయించడాలు, వాళ్ళని బతిమాలడాలు, ఎన్నోజరిగి, ఆడపిల్ల పేరు చెప్పి సావిత్రి, కృష్ణారావు మొత్తం ఆత్మాభిమానాన్ని తెగనమ్ముకున్నారు – అత్తగారు అందుకుంది. "టీ.వీ పాతదైంది. మీ నాన్నని కొత్తది కొనిమ్మని చెప్పు" అన్నాడు మా అబ్బాయి. వున్నమాట చెప్పేందుకు మాకేం భయం? ఏం తప్పా? అల్లుడు మామగార్ని ఏదైనా కొనివ్వమనడం తప్పా? ఆ హక్కులేదా? ఇది ఆచారమేగాని మరొకటి కాదుకదా! ఇస్తారు. ఇవ్వరు. ఇవ్వలేకపోతే ఏదో బతిమాలుకుని, సర్దిచెప్పుకుంటారు. అంతేగాని మొదలుకంటూ అడగడానికి మెలికలు తిరిగిపోతూ, ఏడిస్తే ఎలా? గట్టిగా చెప్పాం. ఏడుపు మొదలుపెట్టి ఆగదే! అడిగితే బాగుంటుందో, బాగుండదో మీరు చెప్తారు కదా అంటూ అత్తగారు వివరించింది.

"చదువుకుంది గానీ మీ అమ్మాయికి తెలివిలేదు" అని మామగారు తేల్చి చెప్పారు. సావిత్రికీ, కృష్ణారావుకీ ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలీక తికమక పడిపోయారు. శ్రీవల్లికి సర్దిచెప్పి "మమ్మల్ని అడిగితే మేం చూస్తాం కదా" అంటూ వెంటనే మంచి కలర్ టీవీ సెట్‌తో బాటు శ్రీవల్లిని అత్తారింటికి పంపారు.

ఈ హడావిడి పడుతున్నప్పుడే మూడో అంతస్థు సన్‌షేడ్ కింది పెట్టిన తేనెపట్టును పొగపట్టి, నిప్పుపెట్టి, చెదరగొట్టి పడగొట్టారు. కాంపౌండులో తేనెటీగలు చెల్లాచెదరై గోలగా ఎగిరాయి. కాళ్ళావేళ్ళాపడి బతిమాలితే వచ్చిన శ్రీవల్లి మొగుడ్ని ఒక తేనెటీగ కుట్టనే కుట్టింది. గిట్టక తేనెటీగ చేత కుట్టించారని అత్తగారు పెద్ద రాద్ధాంతం చేయనే చేసింది.

మరో మూడు నెలలకు శ్రీవల్లి ఉద్యోగంలో చేరింది. ఆమె మీద ఇంటిల్లిపాదీ నిఘావేసి కాలేజీకని వెళ్ళి అమ్మానాన్నల దగ్గర కెల్తుందేమోనని వెయ్యి కళ్ళతో చూడటం మొదలు పెట్టారు. బయట నుంచి ఫోనుచేసి మాట్లాడుతుందేమోనని నానారకాల ఒట్లు వేయించుకుని బాగా కట్టుదిట్టం చేసి ఉద్యోగానికి పంపటం మొదలుపెట్టారు. ఇన్ని జరుగుతున్నా శ్రీవల్లి ఏం చేసింది అంటే చెప్పడం కష్టమే. తరుచూ ఏడుస్తూ ఆడవాళ్ళకి కష్టాలు సహజమేనని నమ్మి, కొన్నాళ్ళు భరించాలని నిర్ణయించుకుని వుండవచ్చు. పెళ్ళి అంటే ఇలాగే వుంటుందిగాని ఇంతకంటే ఆనందంగా వుండదని నమ్మి వుండవచ్చు.

వచ్చిన జీతంలో లెక్కలు సరిగ్గాలేవని తల్లిదండ్రులకు డబ్బు ఇచ్చేస్తోందని అనుమానంగా వుందని అల్లరి చేస్తే భరించలేక అమ్మదగ్గర కొచ్చేసింది శ్రీవల్లి.

సరిగ్గా మూడు నెలల క్రితం ఆ రోజంతా సావిత్రి, కృష్ణారావు ఇంట్లో తలుపులేసుకుని శ్రీవల్లి లెక్కలన్నీ సరిచేసి పెట్టారు. ఎందుకంటే బయట తేనెపట్టు చెదరగొడుతున్నారు.

మర్నాడు పే సర్టిఫికెట్‌తో సహా చూపించి తమ కుమార్తె నిజాయితీని బల ప్రదర్శనలో నిరూపించుకుని పిల్లని పంపారు. కాలేజీలో వాళ్ళు ముక్కుమీద వేలు వేసుకున్నారు. కానీ ఆ తల్లిదండ్రులు పిల్ల అత్తారింటికెళ్ళినందుకు గుండెల మీద చెయ్యేసుకున్నారు.

అప్పటికీ 'పిల్లాడు మంచివాడే - అత్తగారే పేచీకోరు, గయ్యాళి - ఆ మామగారు తిక్కలాడు' అంటారు కృష్ణారావు, సావిత్రి- కారణం అతను గదిలో బాగానే వుంటాడుట.

చాలాదగ్గర స్నేహితుడు "పంపకు. వాళ్ళే కాళ్ళబేరానికొస్తారు. పెళ్ళి, సంసారం ఆడపిల్లకి ఎంత ముఖ్యమో, మగవాడికీ అంతే ముఖ్యం" అన్నారు. కానీ కాపురం కూలిపోతుందని వారి భయం. అసలు కాపురం కూలడమంటే ఏంటి? నిలవడమంటే ఏమిటి? ఇప్పుడా కాపురం వున్నట్టా లేనట్టా? పురుషుడికున్నట్లే స్త్రీకీ తల్లీదండ్రీ, బంధువులు, మిత్రులు వుంటారనే ప్రాథమిక విషయాన్ని ఒప్పుకోలేకపోతున్న మనుషుల మధ్య కాపురం ఏమిటి?

ఒకప్పుడు స్త్రీని పోషించే భారం పురుషుడి మీద వుండి, సర్వాధికారాలతో ఆమెని బానిసగా చేసేవాడు. కానీ ఇప్పుడు ఆమె కూడా సంపాదించాలి. సాయం చెయ్యాలి. అమ్మాయి ఎవరితో మాట్లాడాలో మాట్లాడకూడదో నిర్ణయించే అధికారం వాళ్ళకెవ రిచ్చారు?

ఈ ప్రశ్నలు వేస్తేనే, ఊహిస్తేనే అడపిల్ల తల్లిదండ్రులు భయంతో వణికి పోతున్నారు. ఆడపిల్లల్ని వ్యక్తిత్వం లేని వాజమ్మల్లాగ, దద్దమ్మలాగా ఎందుకు పెంచుతున్నారు? పిల్లలు కాపురాలెలా చెయ్యాలో తామే బయట నుంచి మోనిటర్ చేయగలమని తల్లిదండ్రులు ఎందుకు అనుకుంటున్నారు? అమ్మాయిని ఒక వ్యక్తిగా చూడక, ఆమెకేం కావాలో మేం చూస్తాం అంటూ తల్లిదండ్రులు ఎందుకు ముందు కొస్తున్నారు?

విజ్ఞతతో గల కాస్తంత స్వేచ్ఛను తన భాగస్వామిని ఎంచుకోవడంలో ఆడపిల్లలకి ఎందుకివ్వడం లేదు.

❖ ❖ ❖

ఒక్కసారి పవర్‌కట్ అయింది. సోఫాలో పడుకుని నిద్రపోయిన శ్రీవల్లి వులిక్కిపడి లేచింది. బయటతలుపు మీద టక్‌టక్ మంటూ శబ్దం వినిపిస్తోంది. లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా తల్లిని చూడంగానే ఏడుపొచ్చింది. కౌగిలించుకుంది. వెనుకగా రేఖని చూసి అవమానపడింది.

"ఛీ! ఏమిటదీ... చూడు – నీ కోసం రేఖ వచ్చింది. తనతో కబుర్లు చెప్పు – నేను కాఫీ కలుపుతాను" అంటూ సావిత్రి చేతిలో వున్న హ్యాండ్ బ్యాగ్ టేబుల్ మీద పెట్టి లోపలికెళ్ళింది.

రేఖ ఏం మాట్లాడలేదు. శ్రీవల్లి కూడా వెంటనే ఏం మాట్లాడలేదు. ఇద్దరూ పక్కపక్కనే సోఫాలో కూర్చున్నారు.

"అమ్మగారూ! తేనెపట్టు పీకేస్తున్నా – కిటికీ తలుపులేసుకోండి" అంటూ కిందనించి కేక వినిపించింది – సావిత్రి "ఇంటికొచ్చాను. మొదలు" అంటూ విసుగ్గా మొదలు పెట్టింది కిటికీ తలుపులు ముయ్యడం.

"మూడు నెలలకోసారి మూలచ్ఛేదం చేసి, ఈగల్ని కొట్టి పట్టుకుని పీకి, నిప్పుపెట్టినా ఆ రాణీ ఈగకి బుద్ధి లేదు. మళ్ళీ మర్నాటి నుంచీ మొదలు పెడుతుంది తేనెపట్టు పెట్టడం – ఛీ! ఇదో న్యూసెన్స్ అయిపోయింది. మరోచోట పెట్టుకునే జ్ఞానం దానికి లేదు" అంటూ చివరి కిటికీ తలుపు ధడేలుమని మూసి బోల్టు పెట్టింది సావిత్రి. ఒక్క క్షణం రేఖ కళ్ళు శ్రీవల్లి కళ్ళతో కలిశాయి. శ్రీవల్లి తలొంచుకోబోయి, తలెత్తి ధైర్యంగా స్నేహితురాలి కళ్ళలోకి చూసింది. ఆ చూపులో తళుక్కున ఒక భావం మెరిసింది.

(రచన మాసపత్రిక)